క్లుప్తంగా

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజారోగ్యంపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. 59వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్‌లో జరుగుతున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలతో కలసి పలు నివాసాలను సందర్శించి ప్రజల అనారోగ్య సమస్యలు తెలుసుకొని వారికి వైద్య సేవలను వివరించారు. ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ ఇంటింటికీ వైద్య సేవలు అందిస్తున్న ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని హర్షం వ్యక్తం చేశారు. అక్టోబర్ 11న అజిత్‌సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించనున్న ఉచిత మెగా మెడికల్ క్యాంపును ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హాఫీజుల్లా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

600 మందికి అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం దాత శ్రీనివాసరావు సహకారంతో 600 మందికి అన్నదానం జరిగింది. తొలుత మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహన రావు బాబాకు విశేషంగా పంచామృతాభిషేకం, అన్నాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన బాబా పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల వర్షాల కారణంగా 30వ డివిజన్‌లో నెమ్మదించిన రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేశారు. ఇప్పటి వరకు రోడ్డు కంటే యూజీడీ మ్యాన్‌హోల్స్ ఎత్తులో ఉండటంతో వాహన చోదకులు పాదచారులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు రోడ్డు పనుల్లో భాగంగా యూజీడీ మ్యాన్‌హోల్‌తో సమానంగా రోడ్డును సరిచేశారు. గద్దె వెంకట్రామయ్య నగర్, దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డును విశాలంగా తీర్చిదిద్దుతున్నారు.

నవయుగ కవితా చక్రవర్తికి స్వర నీరాజనం



విజయవాడ కల్చరల్: ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతి, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గురువారం గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించారు. కారుమంచి రాజు మాట్లాడుతూ కవిగా, నాటక రచయితగా జాషువా తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. నాటి యువకులను ఎందరినో ప్రభావితం చేసినట్లు తెలిపారు. సినీ సంగీత విభావరిలో భాగంగా ఆదిరాల జయప్రభ, రమాశంకర్, కొమ్మినేని రత్నకుమారి, పావని, శ్రావణి,శ్రీనివాసరావు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఘనంగా అనంత పద్మనాభ స్వామి వ్రతం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం అనంతపద్మనాభస్వామిస్వామి వ్రతాన్ని ఆచరించారు. వ్రతంలో పలువురు భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు భక్తులతో వ్రతాన్ని చేయించారు. వ్రతం ఆచరిస్తే సకల కార్యాల్లో విజయం సిద్ధిస్తుందని పేర్కొంటూ వ్రత మహాత్మ్యాన్ని భక్తులకు వివరించారు. స్వామి వారికి 14 రకాల పుష్పాలతో విశేష అర్చన, 14 రకాల నైవేద్యాలను నివేదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులతో పాటు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు, హాజరైన కార్పొరేటర్లు, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి వైద్యం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కార్పొరేటర్లు, నాయకులు విజయవంతం చేయాలని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని తన కార్యాలయంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైస్సార్ సీపీ కార్పొరేటర్లు, డివిజన్ కోఆర్డినేటర్లు, ఇన్‌చార్జిలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 30వ తేదీ నుంచి నెల రోజులపాటు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని డివిజన్లలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించాల్సి ఉందని, లోటుపాట్లు లేకుండా సజావుగా చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

ఇప్పటికే నియోజకవర్గంలో వలంటీర్లు తమ పరిధిలోని అన్ని కుటుంబాలను కలిసి వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తిస్తున్నారన్నారు వలంటీర్లు సందర్శించిన ప్రతి ఇంటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి పరీక్షలు చేస్తారని చెప్పారు. వారిలో పెద్ద సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తిస్తే వారిని ఈనెల 30 నుంచి జరిగే ప్రత్యేక క్యాంపులకు తీసుకువచ్చి ఆ శిబిరాల్లో ఏర్పాటుచేసిన సూపర్ స్పెషాలిటీ, ఆరోగ్య కేంద్రాల వైద్యుల ద్వారా చికిత్స అందిస్తారన్నారు. రోగులకు 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, దీన్ని విజయవంతం చేయాలని కోరారు. సమీక్షలో వైసీపీ కార్పొరేటర్లు ఇసరపు దేవి రాజారమేష్, ఎండీషాహినా సుల్తానా, అలంపూరు విజయలక్ష్మి, ఉమ్మడి రమాదేవి వెంకట్రావు, పెనుమత్స శిరీష సత్యం, కుక్కల అనిత, బంకా శకుంతల దేవి, ఉద్దంటి సునీత, బాలి గోవింద్, శర్వాణీమూర్తి, జానా రెడ్డి, కొంగితల లక్ష్మీపతి, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఆత్మకూరు సుబ్బారావు, గుండె సుందర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. గురువారం డివిజన్లో 268 సచివాలయం పరిధిలో ఏవీఎస్ రెడ్డిలో ఇంటింటికి వెళ్లి సర్వేలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అలంపూరు విజయ్, రామిరెడ్డి, మహిళా నాయకులు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్–ఉన్–నబీ



వేడుకల్లో ఎమ్మెల్యే విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ ప్రాంతాల్లో గురువారం మిలాద్–ఉన్–నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. మసీదులు, దర్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 60వ డివిజన్ వాంబేకాలనీలోని ఆస్థాన ఏ గరీబ్ నవాజ్ అజ్మీర్ షరీఫ్ ఖాజా బాబా ఆశ్రమంలో వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ముస్లిం మతగురువులతో కలసి ఇస్లాం జెండాను ఆవిష్కరించారు. 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట శ్రీనివాస్, ఎండీ హఫీజుల్లా, ఉమ్మడి వెంకట్రావ్, పొదిగింటి నాగరాజు తదితరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అల్పాహార విందు జరిగింది. అతిథులను ఖాజా బాబా ఆశ్రమం కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త పఠాన్ బాబ్జి ఉమర్ ఖాన్ ఇస్లాం సంప్రదాయం ప్రకారం సత్కారం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కమిటీ ప్రతినిధులు బాషా, రషీద్, రాజేష్, వహీద్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

రచనలతో చైతన్యపరిచిన జాషువా



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మానవతావాది గుర్రం జాషువా అని తన రచనలతో సమాజాన్ని చైతన్యపరిచిన మహోన్నత వ్యక్తి అని అల్లూరి సాంస్కృతిక సంఘం కోశాధికారి డీజేపీఎస్ రాజు కొనియాడారు. ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా గురువారం కవికోకిల గుర్రం జాషువా జయంతి వేడుకలు జరిగాయి. ఆయన ముఖ్య అతిథిగా గ్రంథాలయం కార్యదర్శి పీవీ సుబ్బరాజు, శ్రీనివాసరాజుతో కలిసి జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాషువా సేవలను కొనియాడారు. అంటరానితనం, పేదరికం వంటి దుర్భర కష్టాలకు ఎదురు నిలిచి పోరాడిన ధీశాలి మహాకవి గుర్రం జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో సాంస్కృతిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, కార్యదర్శి కేవీఎస్ ప్రసాదరాజు, డి.భాస్కరరాజు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): జాషువా రచనలు అందరికి ఆదర్శనీయమని తెలుగు బాప్టిస్ట్ చర్చిస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రెవ. మంగలపూడి జోసఫ్ అన్నారు. కవి గుర్రం జాషువా జయంతి కార్యక్రమం సింగ్‌నగర్‌లోని బీసీటీసీ కార్యాలయం వద్ద గురువారం జరిగాయి. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాస్టర్ మరియదాసు బండ్లను ఘనంగా సన్మానించారు. జాషువా రచనలను వినిపించారు.

సుఖసంతోషాలతో జీవించాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ లక్ష్మీపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అందరికీ వినాయకుడి ఆశీస్సులు అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. మధురానగర్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి కార్యాలయం వద్ద గురువారం గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏటా కుల మతాలు, రాజకీయాలకతీతంగా చవితి వేడుకలను జరుపుకోవటం అభినందనీయమన్నారు. పండుగలతో బంధాలు పటిష్టమవుతాయన్నారు. సుమారు ఐదువేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. కార్యక్రమంలో ఒకటో డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, సురేష్, వైఎస్సార్‌సీపీ నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు, వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి, నగర మహిళ అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేణి, నాయకులు, డాక్టర్ జయకృష్ణప్రసాద్, కోలా రమేష్ బాబు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తినగర్‌లో తారురోడ్డు అభివృద్ధి



ప్రజాశక్తినగర్‌లో తారురోడ్డు అభివృద్ధి పనులు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం 64వ డివిజన్ ప్రజాశక్తినగర్‌లో తారురోడ్డు అభివృద్ధి, విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గురువారం ఆ పనులను పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, షేక్ ఇస్మాయిల్, అక్కిశెట్టి నారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంటు నవీన్ పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో స్థానికులు రోడ్డుపై గోతులు పడి నడవడానికి ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు తెలియజేశారు. ఆయన ఆదేశాలతో రోడ్డు అభివృద్ధి, విస్తరణ పనులు చేస్తున్నారు. 300 మీటర్లు దూరం రోడ్డు అంచనా రూ.19.97 లక్షలుగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ తెలిపారు.

1నుంచి కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు

సీపీ టీకే రాణా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ 1861 ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్, మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మేజిస్ట్రేట్ టీకే రాణా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా 92 రోజుల పాటు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని వివరించారు. ఆ సమయంలో కమిషనరేట్ పరిధిలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలను పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు వినియోగించుకోండి



మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఎస్ఎన్‌ఎల్ సేవలను వినియోగించుకోవాలని బీఎస్ఎన్‌ఎల్ జీఎం వై.రవీంద్రనాథ్ సూచించారు. బీఎస్ఎన్ఎల్ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని గురువారం పాయకాపురం గాయత్రీ విద్యాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. వీటిని వినియోగించుకోవాలని సూచించారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఎం.అఖిలకు ఏడాది పాటు బి.ఎస్.ఎన్.ఎల్ భారత్ ఫైబర్‌నెట్ ప్లాన్ 599 ద్వితీయ స్థానం సాధించిన కె.ఎస్తేర్‌కు ఆరునెలల ప్లాన్, తృతీయ స్థానంలో నిలిచిన ఇశాకు మూడునెలల ప్లాన్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15 నుంచి విజయదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 8.01 గంటలకు గణపతి పూజ, కలశస్థాపన జరుగుతుందని, ఉదయం 11 గంటలకు విశేష కుంకుమార్చన జరుగుతుందని పేర్కొన్నారు. 15వ తేదీ అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరిదేవిగా, 16న శ్రీ గాయత్రిదేవి, 17న శ్రీ అన్నపూర్ణాదేవి, 18న శ్రీమహాలక్ష్మీదేవి, 19న శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి, 20న మూలా నక్షత్రం శ్రీ సరస్వతిదేవిగా, 21వ తేదీ శ్రీ దుర్గాదేవి, 22న శ్రీమహిషాసురమర్ధినిదేవి, 23న రాజరాజేశ్వరిదేవి అలంకారాల్లో దర్శనమివ్వనున్నారు.

సీఎం పర్యటనకు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు

డీసీపీ విశాల్‌గున్ని



పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన డీసీపీ విశాల్‌గున్ని

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యాధరపురం ఆర్టీసీ డిపో సమీపంలోని మినీ స్టేడియంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర పథకం విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించడానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి రానుండటంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గురువారం సభా ప్రాంతంలో పోలీసు అధికారులు, సిబ్బందితో డీసీపీ సమావేశమై బందోబస్తు విధులపై మార్గదర్శకాలు, సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం హాజరయ్యే కార్యక్రమానికి సభా ప్రదేశం, పరిసర ప్రాంతాల్లో 1200 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత, బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖులకు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్బీ ఏడీసీపీ జీవీ రమణమూర్తి, ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, పశ్చిమ ఏసీపీ కె.హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం

కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో రెండో దశ రీ సర్వే ప్రక్రియలో భూహక్కు పత్రాలను పెండింగ్ లేకుండా పంపిణీ చేస్తున్నామని, జగనన్నకు చెబుదాం– 1902లో నమోదవుతున్న అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపుతున్నామని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డికి వివరించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలో 14 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. ఆయా గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్, భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేస్తున్నామన్నారు. రెండవ దశలో 15 గ్రామాల్లో రీ సర్వేలో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియలో భాగంగా 12,968 సరిహద్దు రాళ్ల పాతడం లక్ష్యమని ఇప్పటికే ఏడు గ్రామాల్లో 8,638 సరిహద్దు రాళ్లను నాటే ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మూడో దశ రీ సర్వేలో భాగంగా జిల్లాలోని 100 గ్రామాల్లో గ్రౌండ్ టూతింగ్ వ్యాలిడేషన్ ప్రక్రియను పూర్తి చేసి నిర్దేశించిన ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్నకు చెబుదాంలో పరిష్కరించిన అర్జీల వివరాలు తెలియజేశారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 15వ తేది నుంచి అక్టోబర్ 2వ తేది వరకు చెత్త రహిత భారత్‌లో భాగంగా వ్యర్థాల నిర్వహణను చేపట్టామన్నారు. వీసీలో జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, డ్వామా పీడీ జె. సునీత, పంచాయతీరాజ్ ఈఈ కె. వెంకటేశ్వరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ నాగమణిమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్



స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మరణం తీరని లోటని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎస్వీ రావు తెలిపారు. కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో గురువారం ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఎస్వీరావు మాట్లాడుతూ వరి, గోధుమ వంగడాలపై స్వామినాథన్ పరిశోధనలు చేశారని, వాటి కారణంగా నేడు ఎన్నో మేలు జాతి వంగడాలు లభిస్తున్నాయని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తిని సాధించి ఎన్నో అవార్డులు, రివార్డులను అందుకున్నారని వివరించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని రేణుకాదేవి, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, మమత, సురేఖ, ఝాన్సీ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధిస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 53లో కటారి రాజేశ్వరి, గోపి నివసిస్తున్నారు. వీరిది ప్రేమ వివాహం. గోపి సీలింగ్ పనులు చేస్తుంటాడు. కొంత కాలంగా గోపి మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్నాడు. 27వ తేదీ రాత్రి ఇంటికి వచ్చిన గోపి భార్యను కొట్టసాగాడు. దీంతో రాజేశ్వరి తల్లి అడ్డు రాగా ఆమెను కొట్టాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తండ్రి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తండ్రి అదృశ్యం కావడంతో కుమారుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. బ్రహ్మంగారి మఠంకు చెందిన బైరెడ్డి విద్యాసాగర్ చేపల మార్కెట్ వద్ద మెడికల్ షాపు నిర్వహిస్తుంటాడు. అతని తండ్రి సింహాచలం(70), తల్లి పద్మావతి కొడుకు వద్దే ఉంటారు. ఈ నెల 23వ తేదీ సింహాచలానికి భార్యతో చిన్న గొడవ జరగడంతో బయటకు వెళ్లి వస్తానని చెప్పాడు. సాయంత్రమైనా తండ్రి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన విద్యాసాగర్ తన తమ్ముడు, చెల్లెలను ఆరా తీసినా ఫలితం లేదు. తండ్రి కనిపించడం లేదంటూ అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రజారోగ్యానికి పెద్ద పీట

15 మంది బాధితులకు రూ.13.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, పక్కన డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజారోగ్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. నియోజకవర్గంలోని 15 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.13.50 లక్షలు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన చెక్కులను గురువారం సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణు బాధితులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజారోగ్య రంగంలో నూతన శకం ప్రారంభమైందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైఎస్సార్ ఆనాడు ఎంతోమంది ప్రాణాలు కాపాడి ప్రాణదాతగా నిలిస్తే నేడు ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీలో గతంలో కంటే ఎక్కువ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, కార్పొరేటర్ జానారెడ్డి, నాయకులు అలంపూరు విజయ్, యర్రగొర్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్‌లో 2,265 మందికి ఐదో విడత వాహనమిత్ర

నియోజకవర్గంలో వాహనమిత్ర పథకంలో ఐదో విడత 2,265 మందికి రూ.2.26 కోట్ల నిధులు వారి వ్యక్తిగత ఖాతాల్లో శుక్రవారం జమ చేయనున్నట్లు ఎమ్మెల్యే విష్ణు ఓ ప్రకటనలో తెలిపారు.

పోరాట యోధుడు భగత్‌సింగ్

కలెక్టర్ ఢిల్లీరావు



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు భగత్ సింగ్ అని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలన నుంచి దేశ విముక్తి కోసం ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి ఉరికంబమెక్కిన ఆయన త్యాగరీతి మరువలేనిదన్నారు. నేటి యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

యువతకు స్ఫూర్తి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భగత్‌సింగ్ చేసిన పోరాటాలు యువతకు స్ఫూర్తి అని పలువురు వక్తలు కొనియాడారు. 58వ డివిజన్ సీపీఐ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం సర్దార్ భగత్ సింగ్ జయంతి కార్యక్రమం సింగ్‌నగర్ హోచిమన్ భవన్ వద్ద జరిగింది. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు పి.నాగరాజు, సాయికుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..



ఎంబీ స్టేడియంలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డీవైఎఫ్ఐ నేతలు, క్రీడాకారులు

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) విజయవాడ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో, 60వ డివిజన్ వాంబేకాలనీలో జరిగాయి. డీవైఎఫ్ఐ నాయకులు జి.రామన్న తదితరులు పాల్గొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు శివ, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

పెనమలూరు: జాతీయ స్థాయి రోలర్ హాకీలో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి సుజిత్ పాల్గొన్నాడు. ఈ మేరకు కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ రఘు గురువారం వివరాలు తెలుపుతూ తమ కాలేజీలో ఈఐఈ రెండో సంవత్సరం చదువుతున్న సుజిత్ ఇటీవల నాగ్‌పూర్‌లో జరిగిన 17వ జాతీయ రోలర్ హాకీ పోటీల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించాడని తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్ విద్యార్థి సుజిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో సివిల్ హెడ్ చావా శ్రీనివాస్ పాల్గొన్నారు.